
కథ



# కలలు కనే కళ్ళున్నాయి

డా॥ రోష్ని

"కనీసం పిల్లనైనా తెచ్చుకోవలసింది. దాన్ని చూసుకునైనా కాస్త దుఃఖాన్ని మరిచిపోవచ్చు..." అమ్మ ఇంకా ఏదో బోధించబోయింది. "నేనిప్పుడేం దుఃఖంతో సతమతమయిపోడంలేదులే" పొడిగా సమాధానం చెప్పి ఊరుకుంది సరస్వతి. కాని లోపల దహించుకుపోతోంది. అవమానం... ఇంత అవమానమా... ఈ మనుషులు మారరా...? ఎందుకిలా జరుగుతోంది?

ఎన్ని కలలు కంది, ఎటువంటి ఆశల్తో ఈ పెళ్లి చేసుకుంది. మరిప్పుడు ఇలా ఎందుకు జరిగింది? ఇప్పుడు ఆ పెళ్లి బంధం తెంచేసుకుని బయటికి రావడం సబబేనా? లోపలంతా కలకలం, కల్లోలం. పైకిమాత్రం గంభీరంగా "టైము పన్నెండయిపోయింది. పోయి పడుకో అమ్మా! నీకసలే బి.పి. ఉంది. కాస్త విశ్రాంతి అవసరం" అని చెప్పి అమ్మకి పక్కేసింది సరస్వతి.

సరస్వతి భర్తనించి దూరంగా వచ్చి వారం రోజులయింది. తన స్నేహితురాలి ఇంట్లో రెండు గదులు ఖాళీగా ఉంటే అద్దెకు తీసుకుంది. స్నేహితురాలే చిన్న స్టౌ, కాసిన్ని గిన్నెలు ఇచ్చింది. సూపర్ మార్కెట్ నుంచి ఏదో సామాను తెచ్చుకుని గడిపేస్తోంది. భవిష్యత్ ఎలా ఉంటుందో... మొదట్లో కాలేజికి లాంగ్‌లీవ్ పెట్టేద్దా మనుకుంది. మళ్లా ఆలోచించుకుంది. ఇంట్లో కూర్చుంటే గతాన్ని గురించి ఆలోచన్లు తప్ప ఉపయోగం ఏమీ ఉండదనుకుని మనసు మార్చుకుంది. కాలేజ్‌కెళ్లివస్తోంది. అక్కడ వింత చూపుల్ని, వెకిలి పలకరింపుల్ని లెక్కచేయలేదు. సానుభూతి మాటల్ని వినీవిననట్లు వదిలేసింది. Life goes on... అనుకుంది. వారం గడిచిపోయింది. విషయం తెలిసి అమ్మ ఊరినుంచి పరిగెత్తుకొచ్చింది. చాలా బెంగపడు తోంది. ఇప్పుడొచ్చిన నష్టమేమిటి? ఇలా జరిగిందని ఏడుస్తూ కుమిలిపోవాలా? అవమానాన్ని భరిస్తూ కలిసే జీవించాలా? ఆడదానికి పెళ్లే సర్వస్వమా? మొగుడికి వండిపెట్టడం, పక్కలో పడుకోడం, పిల్లల్ని కనడం, వాళ్లను పెంచడం, ఇక ఉద్యోగం ఉంటే అదీ చేస్తూ, ఫస్టుకి జీతం తెచ్చి భర్త చేతుల్లో పెట్టడం... ఇలాగ గడిచిపోతేనే జీవితం ధన్యం అనుకోవాలా? పరిపూర్ణ స్త్రీ అంటే ఇలాగే ఉండాలా? Is it fair enough?

ఇలా ఆలోచిస్తూ మళ్లీ గతంలోకి వెళ్లిపోయింది సరస్వతి...

యూనివర్సిటీలో తను M.Sc. బోటనీ మొదటి సంవత్సరం చదువుతున్న రోజుల్లో పరిచయం అయ్యాడు వరప్రసాద్. స్టూడెంట్ యూనియన్ లీడరు. చలాకీగా చిరునవ్వుతో పలకరిస్తూ, కబుర్లు చెపుతూ, ఎన్నో రాజకీయ విషయాల గురించి పది మందితో చర్చిస్తూ కనిపించే వాడు. అప్పటికే M.A. ఫైనల్లో ఉన్నాడు. చాల విషయాల్లో కొట్టినట్లు తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పే అతని తత్వం చూసి ముచ్చటపడింది. కుల వివక్షత– నిర్మూలన గురించి జరిగిన సెమినార్‌లో ప్రసాద్ చెప్పిన మాటలు విని ముగ్ధురాలయ్యింది. తనను తాను పరిచయం చేసుకుని స్నేహాన్ని పెంచుకుంది. ఈలోపు ఫైనల్ పరీక్షలు నెలరోజులున్నాయనగా వరప్రసాద్‌ను యూనివర్సిటీ నుంచి డిబార్ చేసారు. రెండు స్టూడెంటు యూనియన్ల మధ్య జరిగిన కొట్లాటలో ఒక విద్యార్థి మృతి చెందాడు. ఆ కేసులో వరప్రసాద్‌ని ఇరికించారు.

అయితే ఈ సంఘటన వారి స్నేహానికి అడ్డుకాలేదు. సరస్వతి చదువు పూర్తయింది. ప్రసాద్ విద్యార్థి సంఘాలు అంటూ తిరుగు తూనే ఉన్నాడు. నేరం రుజువు కానందున వరప్రసాదుపై పెట్టిన కేసులు కొట్టేయడం జరిగింది. ఈ లోపు ఏదో ప్రయివేటు కాలేజీలో ఉద్యోగం వస్తే చేరిపోయింది. మొదటి జీతం అందుకుని తన ఫ్రెండ్స్ అందర్నీ పిలిచి పార్టీ ఇచ్చింది. వరప్రసాద్ కూడ వచ్చాడు. అందరూ భవిష్యత్తులో ఏంచేయాలనుకుంటున్నారో ఒకరికొకరు చెప్పుకున్నారు. సరస్వతికి ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని; ఈ పెళ్లిచూపులు, ముక్కూ మొహం తెలీనివాడిని పెళ్లి చేసుకోడం తనకేమాత్రం ఇష్టంలేదని చెప్పింది.

పార్టీ అయిపోయింది. అందరూ వెళ్లిపోయినా వరప్రసాద్ ఉండిపోయాడు. సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఏదో పుస్తకావిష్కరణ ఉంది వస్తారా అని అడిగాడు. అంగీకరించింది. సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో కలిసింది. మీటింగ్ మధ్యలో తలనొప్పిగా ఉందని టీ తాగడానికి బయటికి వచ్చారు. అప్పుడు అడిగాడు వరప్రసాద్ పెళ్లి చేసుకుందామని. ఆశ్చర్యం వేసింది. ఆనందమూ కలిగింది. వెంటనే భయం కూడ వేసింది. కొద్దిగా ఇబ్బంది పడుతూ తన కులం గురించి, కుటుంబం గురించి చెప్పింది. తనకు అంతా తెలుసని, ఇవేమీ తనకు అడ్డుకాదని, తన తల్లిదండ్రుల్ని ఒప్పించడం కొంచెం కష్టమే అయినా ఒప్పిస్తానని చెప్పాడు. తర్వాత మీటింగ్‌లో కూర్చున్న సరస్వతికి వక్తలు మాట్లాడుతున్నదేమీ వినిపించలేదు. పెళ్లి... సంసారం... కలలు... కలలు. కంటినిండా కలలు... మీటింగ్ అయిపోయింది. వరప్రసాద్ సరస్వతిని హాస్టల్ దగ్గర దించి వెళ్లాడు.

తర్వాత రెండురోజులకోసం సరస్వతి అమ్మవాళ్ల ఊరు వెళ్లింది. అమ్మ, నాన్నలకు వరప్రసాద్ గురించి చెప్పింది. మొదట్లో ఒప్పుకోక పోయినా తర్వాత నీ ఇష్టం, కానీయ్ అన్నారు. మళ్లీ కలలు... కంటినిండా కలలు...

నెల రోజుల్లో పెళ్లి జరిగిపోయింది. ప్రసాద్ తల్లిదండ్రులు పెళ్లికి రాలేదు. వాళ్లు ససేమిరా ఈ పెళ్లికి ఒప్పుకోలేదు. వెతికి వెతికి ఓ

చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు. చుట్టూ ఖాళీస్థలం ఉంది. కాలేజీకి కొంచెం దూరం అయినా బస్సుల్లో పోయిరావచ్చులే ఇల్లు బావుంది కదా అని తీసుకున్నారు. ఇంటిచుట్టూ కూరగాయల మొక్కలు పెట్టారు. సరస్వతి తెల్లవారుఝామునే లేస్తుంది. పనులన్నీ ముగించుకుని ఏడుగంటలకే బస్సు ఎక్కాలి కాలేజ్ అయిపోయాక మళ్లీ గంటన్నర బస్సు ప్రయాణం. మళ్లా తోటపని... ఇంటిపని... ప్రసాదు ఇంటిపనుల్లో సాయం చేసేవాడు. సెలవుల్లో సాయంత్రాలు తోట మధ్యలో కూర్చుని స్నేహితుల్తో కబుర్లు, టీలు, టిఫిన్లు, పాటలు- హాపీగానే ఉంది. కలలు నిజమవుతున్నాయి. కలలు... కలలు...

ఒకరోజు సడన్‌గా బిజినెస్ చేయాలి అనే ఐడియా వచ్చింది ప్రసాదుకి. బిజినెస్‌కి పెట్టుబడి ఎక్కడ్నుంచి వస్తుంది? దానికంటే మధ్యలో వదిలేసిన M.A. పూర్తి చేస్తే బావుంటుందనిపించింది సరస్వతికి. కాని ప్రసాద్ ఒప్పుకోలేదు. ఒకరికింద పనిచెయ్యడమో, గవర్నమెంటు గుమాస్తాగిరీ వెలగబెట్టడమో చేయడంకంటే స్వతంత్రంగా బిజినెస్ చేసుకోడం మంచిదన్నాడు. మరి డబ్బు...

"అప్పు తీసుకోద్దాం. కనీసం రెండు లక్షలు కావాలి" ప్రసాద్.

"మనకి అంత అప్పిచ్చేవాళ్లెవరున్నారు?" సరస్వతి.

"నీకు ఉద్యోగం ఉందిగా. నువ్వు surity ఇస్తే అప్పు దొరుకుతుంది" ప్రసాద్. సరస్వతి మారు మాట్లాడలేదు. నేనూ ఒకరికిందే పనిచేసి జీతం తెస్తున్నానుగా అనుకుంది. పైకిమాత్రం ఏమీ అనలేదు. తెచ్చిన అప్పు కాగితాలమీద సంతకాలు పెట్టింది.

చిన్న పుస్తకాల షాపు తెరిచారు. పుస్తకాలు అమ్మడమే కాదు. రకరకాల పుస్తకాల్ని రోజుకి 50 పై. చొ॥న అద్దెకిచ్చేవారు. ఐదారు నెలలు షాపు బాగానే నడిచింది. మధ్యలో ఏదో పార్టీ మీటింగ్‌కి వెళ్లాలని షాపు మూయడం మొదలయ్యింది. తర్వాత రోజులనుంచి వారాల తరబడి షాపు మూతబడింది. ఈ లోపు ఎవరివో మరో రెండు పుస్తకాల షాపులు వచ్చేసాయి. ప్రసాద్ షాపు పూర్తిగా దివాళా తీసింది. అప్పు తీర్చడం సరస్వతి భుజాలపై పడింది. ఇంటిఖర్చు, అప్పు రెండింటికీ తన జీతం సరిపోవడం లేదని ఈవినింగ్ కాలేజీలో మరో రెండు గంటలు పనిచేయడం ప్రారంభించింది సరస్వతి.

ఇదంతా చాలదన్నట్టు సరస్వతి నెలతప్పింది. తాము అనుసరిస్తున్న కుటుంబనియంత్రణ పద్ధతి నూరుశాతం ప్రొటెక్షన్ ఇచ్చేదికాదు కనుక ఇలా జరిగింది. ఈ కష్టకాలంలో పిల్లల్ని కనడం చాల బుద్ధి తక్కువ అని, అబార్షన్ కోసం ప్రయత్నించింది సరస్వతి. మొదటి ప్రెగ్నెన్సీ కాబట్టి కనడమే మంచిదని, ఎబార్షన్ల వల్ల వచ్చే తర్వాతి సమస్యలను విశదీకరించి చెప్పింది డాక్టరమ్మ. చివరికి ఎబార్షన్ ఐడియాకి స్వస్తి చెప్పింది సరస్వతి.

కాలేజి, మరో రెండు గంటలు పార్ట్‌టైమ్ జాబ్, ఇంట్లో పని- వీటికితోడు వేవిళ్లు- వాంతులు, సాయంత్రానికల్లా సరస్వతి పూర్తిగ అలసిపోతోంది. ఇదంతా చాలదన్నట్లు ప్రసాద్ ఇంటిపనుల్లో సాయం చేయడం తగ్గించుకున్నాడు. ఫ్రెండ్స్‌తో కలిసి కూర్చోడం, కబుర్లు- చర్చలు మామూలయిపోయాయి. అప్పుడప్పుడు డ్రింక్సు, సిగరెట్లు తోడవుతున్నాయి. సరస్వతికి ఆందోళన ఎక్కువయింది. ఓరోజు సాయంత్రం ప్రసాద్‌కి నచ్చచెప్పడానికి ప్రయత్నించింది.

"నువ్వో గొప్ప ఉద్యోగం వెలగబెడుతున్నానని కదాని నాకు నీతులు చెప్తున్నావా?"- ప్రసాద్ అసహనంగా అరిచాడు.

సరస్వతి బిత్తరపోయింది. తనే ఏదో తప్పు చేసినట్టుగా గిల్టీ ఫీలింగ్. దుఃఖం ఆగలేదు. బాత్‌రూమ్‌లోకి పోయి వెక్కివెక్కి ఏడ్చింది. చల్లటి నీళ్లతో మొహం కడుక్కుని బయటికొచ్చి వంటపనిలో పడిపోయింది.

"సారీ! ఏదో కోపంలో అరిచా! క్షమించు" ప్రసాద్ బతిమాలుతూ అన్నాడు. సరస్వతి మాట్లాడలేదు. మౌనంగా పని చేసుకుంటోంది. కాసేపు జవాబుకోసం ఎదురుచూసిన ప్రసాద్ అలాంటిదేమీ లేకపోవడంతో బట్టలు మార్చుకుని బయటికెళ్లిపోయాడు.

భరించలేని అలసట. అయినా ఓపిక తెచ్చుకుని పనులన్నీ చేసుకుపోతోంది సరస్వతి. ఇద్దరిమధ్యా మాటలు అంతంతమాత్రమే అవును, కాదు పొడిమాటలే. రోజులు గడుస్తున్నాయి. ఓ వారం రోజులు అమ్మ దగ్గరికి వెళ్లి రావాలనిపించింది సరస్వతికి. ప్రసాదుకా విషయం చెప్తే సరేనన్నాడు. కాలేజీకి సెలవుపెట్టి ఊరెళ్లింది. అమ్మ, నాన్నలకు విషయాలన్నీ చెప్పింది. వాళ్లు కూడ సరస్వతినే సర్దుకుపొమ్మని సలహా ఇచ్చారు. ఆడదాని సంపాదన తింటున్నాననే ఫీలింగ్‌తో బాధపడుతూ అలా ప్రవర్తిస్తున్నాడేమో. నువ్వు విమర్శలు మానేసి ప్రేమగానే ఉండు. తనే మారతాడు- అని సలహా ఇచ్చారు. వారం రోజుల విశ్రాంతి తర్వాత కాస్త కుదుటపడిన మనసుతో, కొత్త ఉత్సాహంతో ఊరు నుంచి తిరిగొచ్చింది. ప్రసాద్ ఇంట్లో లేడు.

ఇల్లంతా చిందరవందరగా ఉంది. కడక్కుండా అట్టేపెట్టిన వంటగిన్నెలు, తినగా వదిలేసిన పదార్థాలతో ప్లేటులు, గ్లాసులు, సిగరెట్టుపీకలు- ప్రాణం వుసూరుమంది. కోపం తన్నుకొస్తోంది. మగ పనులు మాత్రమే చేసి,ఆడపని అయిన cleaning చెయ్యడానికి చేతులు రాలేదు. శాంతం సరస్వతీ! శాంతం! అరవొద్దు! Be calm! తను మారుతాడు. Be calm... cleaning మొదలుపెట్టింది. అదయ్యాక వంట చేసి వచ్చేసరికి ప్రసాద్ వచ్చాడు.

"నువ్వు ఊరెళ్లిన రోజునుంచే పనమ్మాయి రావడం మానేసింది. అందుకే..." ఇంకా ఏదో చెప్పబోయాడు ప్రసాద్.

"ఫరవాలేదులెండి"- నవ్వుతూనే అంది.

"స్నానం చేసి రండి భోంచేద్దాం. ఆకలి దంచేస్తోంది" సరస్వతి.

పనిమనిషి రాలేదని తినడం మానుకోలేదుగా! తాగడం మానుకోలేదుగా. గిన్నెలు కడగడం మాత్రం చేయలేకపోయారు. అది ఆడపని మనకెందుకులే అనా? లేక వట్టి బద్ధకమా? ఏమోలే! శాంతం! శాంతం! Don't argue!

భోంచేస్తున్నంతసేపూ సరస్వతి కబుర్లు చెపుతూనే ఉంది. ప్రసాద్ ముభావంగా ఊ కొడుతున్నాడు.

"మరే, మా ఇంటి పక్కనే ఉండే ముసలయ్యకొడుకు సంస్కృతం సెకండ్ లాంగ్వేజ్ తీసుకుని ఇంటర్మీడియట్ చదివాడు. సెలవుల్లో

**"పాపని మేం చూసుకుంటాం. ఎలానూ పోతపాలు అలవాటు చెయ్యాలనుకుంటున్నావు కదా! ఇంకోనెల సెలవుపెట్టి నువ్వు ఇక్కడే ఉండు. పాపకి పోతపాలు అలవాటయాక వెళ్దువుగాని" అని అంది అమ్మ.**



కూలిపనికి కూడ పోయేవాడు పాపం! 70 శాతం మార్కులతో ఇంటర్ పాసయ్యాడు. ఎంసెట్ రాద్దామనుకుంటున్నాడు. ఆ పిల్లాడికి సీటొస్తే బాగానే ఉంటుంది. వాళ్ల నాన్న చెప్పులు కుట్టి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొడుకు డాక్టరయితే కాస్త సుఖపడతారు" అని ఎంతో ఉత్సాహంగా చెప్పుకుపోతోంది.

"మీ కులాలకు రిజర్వేషన్లు ఉన్నాయికదా! సీట్లు easy గానే దొరుకుతాయి. దాన్లో గొప్పేముంది" లేచి చెయ్యి కడుక్కోడానికి సింక్ వైపు వెళ్లిన ప్రసాద్‌నే చూస్తూ ఉండిపోయింది సరస్వతి. అన్నం తినబుద్ధికాలేదు. ఏంటీ మార్పు. పేదరికంలో మగ్గుతున్న దళితకులాలు పైకి రావాలంటే చదువుల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండాలి. అవకాశాలు పెంచాలి అని సెమినార్లో వాదించిన మనిషేనా... పైగా ముసలయ్య కొడుకు అత్తెసరు మార్కులతో పాసవ్వలేదు. అతని ఆర్థిక పరిస్థితులు బావుంటే 80-90 శాతం మార్కులొచ్చేవేమో. కూలి చేసుకుంటూనే కష్టపడి చదివాడు. 70 శాతం మార్కులు రావడం గొప్పకాదు. ఆ అబ్బాయి కోచింగ్ సెంటరుకు ఎలాగూ వెళ్లలేడు కదా అని పుస్తకాలు కొనుక్కోమని 500 రూ॥లు ఇచ్చి వచ్చినందుకు తనకు ఎంతో ఆనందంగా ఉంది. మరి ప్రసాదేమిటి ఇలా మాట్లాడుతాడు... శాంతం! సరస్వతీ శాతం! Don't argue!



**ఆత్మ హత్యా! అమ్మ, నాన్న నన్ను ఎంత కష్టపడి పెంచారు. కాయగూర లమ్మి, పుల్లల మోపులమ్మి- కాయకష్టం చేసి చదివించారు. చదువుల తల్లి సరస్వతి కావాలని అదే పేరు తనకుపెట్టి కష్టపడి చదివించారు. అలాంటిది మధ్యలో ఏదో అయిందని చనిపోవడమా?**

కాన్పుకి అమ్మగారింటికెళ్లింది సరస్వతి. ఆడపిల్ల పుట్టింది. లక్ష్మీదేవి పుట్టింది అని అమ్మవాళ్లు సంబరపడిపోయారు. మూడు నెలలు అమ్మ వాళ్లింట్లోనే ఉండిపోయింది. మధ్యలో ప్రసాద్ రెండుసార్లు వచ్చి వెళ్లాడు. ఇక ఉద్యోగంలో చేరడానికి వెళ్లిపోవాలి- అనే ఆలోచన వచ్చేసరికి బెంగ మొదలయ్యింది. పిల్లను ఎవరు చూసుకుంటారు. పార్ట్ time జాబ్ చెయ్యకతప్పదు. పాపకోసం చేసిన అప్పు సగం పైగా ఇంకా అలానే ఉంది. తల్లి ఓ సలహా ఇచ్చింది- "పాపని మేం చూసుకుంటాం. ఎలానూ పోతపాలు అలవాటు చెయ్యాలనుకుంటున్నావు కదా! ఇంకోనెల సెలవుపెట్టి నువ్వు ఇక్కడే ఉండు. పాపకి పోతపాలు అలవాటయాక వెళ్దువుగాని" అని అంది అమ్మ. ఈ ఐడియా బాగానే ఉందనుకుని పాపను తీసుకొని సిటీకొచ్చింది సరస్వతి. కాలేజీకెళ్లి ఓ రోజు సంతకం చేసి మళ్లా నెల సెలవు కావాలని బతిమాలి సేంక్షను చేయించుకుని వచ్చింది. మళ్లా అమ్మ దగ్గర పాపను వదిలేయడానికి వెళ్తానని ప్రసాదుకి చెప్పింది. కొంచెం అయిష్టంగానే ఒప్పుకున్నాడు, సెలవుల్లో పాపను తెచ్చుకోవాలనే ఒప్పందంతో.

తిరిగొచ్చాక ఉద్యోగం, పని, జీతం, అప్పులు గడిచిపోతోంది. పాప రెండేళ్లదయింది. వేసవి సెలవుల్లో పాపను తీసుకొచ్చారు నాన్న. అదే సమయానికి అత్తమామలు కూడ వచ్చారు. వాళ్లను ఇదే చూడడం, పెళ్లికి రాలేదు. పాప పుట్టినపుడు రాలేదు. ఇలా హఠాత్తుగా వచ్చిన వాళ్లను చూసి కంగారుపడింది సరస్వతి. ఎక్కడా ఏ పొరపాటు జరక్కూడదని ఏయి దేవుళ్లకి మొక్కుకుంది. ఓ రోజు పాప పెంపకం గురించిన ప్రస్తావనకొచ్చింది. "పాపను మీవాళ్ల దగ్గర ఎందుకు ఉంచడం. మీ దగ్గరే ఉంచుకోండి" అత్తగారు అంది.

"నేనూ అదే అనుకుంటున్నాను. అక్కడ గూడెం జనంమధ్య వాళ్ల మాటలు, అలవాట్లు వంటబడతాయి. తీసుకొచ్చేద్దామనే నేను చెప్తున్నాను" ప్రసాద్.

"నాకు ఉద్యోగం, ఇంటిపని వల్ల పాప ఆలనా పాలనా సరిగా చూసుకోలేననే అమ్మ వాళ్లింట్లో వదలాల్సి వచ్చింది. పోని మీరు వచ్చి మాతోపాటే ఉండండి. బావుంటుంది"- సరస్వతి.

"మాకెక్కడ కుదురుతాదమ్మా! వ్యవసాయం, గేదెలు, పాడి ఇదంతా వదులుకుని రాలేం. నువ్వే ఎవరినైనా పనిమినిషిని పెట్టుకో పిల్లని చూసుకోడానికి" సలహా ఇచ్చింది అత్తగారు.

"అయితే ఇంకో సంవత్సరం అమ్మ వాళ్లింట్లోనే పాపను ఉంచాల్సొస్తుంది. మరో మార్గంలేదు. పనిమనుషులకు పిల్లని అప్పచెప్పడం బావుండదు" సరస్వతి భయపడుతూనే చెప్పింది.

"అసలే ఆడపిల్ల, ఆ వెధవ వాతావరణంలో పెరిగితే మా కులపోళ్లెవ్వరూ పిల్లోడినివ్వరు. కాస్త ఆలోచించు" అత్తగారు విసురుగా లేచి వెళ్లిపోయింది.

దేవుడా! ఏంటీ మనుషులు! నేను కూడ అదే వాతావరణంలో పెరిగినదాన్నే కదా! అంటే నేనూ పనికిరానుగా! ఆడపిల్లను కనడం కూడ తప్పేనన్నట్లు మాట్లాడుతున్నారు. అదీ ఇప్పట్నుంచే దానిపెళ్లి గురించిన బాధ. తమ కులంలో పిల్లోడికే ఇచ్చి చెయ్యాలని తపన. అదే సర్వస్వమా?! దాని చదువు, ఉద్యోగం గురించి ఆలోచించరే! మా వాళ్ల దగ్గర పెరిగితే పిల్ల పాడవుతుందా? ఆ మాటలు, అలవాట్లు వచ్చేస్తాయా? అవన్నీ పనికి రానప్పుడు నేనెలా పనికొస్తున్నాను. బహుశా నేనూ పనికిరాను. కేవలం నా జీతం పనికొస్తుందనుకుంటాను. ఏంటిదీ... suffocation... ఊపిరి తిరగడం లేదు... శాంతం! సరస్వతీ శాంతం! Don't argue! రాత్రి భోజనాలయ్యాక ప్రసాద్‌తో పాప విషయం మాట్లాడ్డానికి ప్రయత్నించింది. ఇంకొక్క సంవత్సరం అమ్మావాళ్ల దగ్గరుంచితే తర్వాత స్కూల్లో వేసే వయసు వచ్చేస్తుంది. అప్పుడు తెచ్చుకోవచ్చుని. ససేమిరా ఒప్పుకోలేదు.

"నిన్ను చేసుకుని అమ్మ, నాన్నలకు దూరమయ్యాను. ఇప్పుడేమో నీ మూర్ఖత్వం వల్ల కూతురికి కూడ దూరమవుతున్నాను. నీకెలా అర్థం అవుతుంది? అర్థం చేసుకునే కెపాసిటీ ఉంటేగా...!" ఇక వినలేకపోయింది.

దుఃఖం ముంచుకొస్తోంది. ఏడవకూడదు. ఏడుపు దీనికి పరిష్కారం కాదు. నాకు కొంచెం time కావాలి. నేను ఆలోచించుకోవాలి. టైమ్ కావాలి. కొంచెం space కావాలి. ఊపిరాడ్డంలేదు. గాలి... కొంచెం గాలి... వెలుతురు కావాలి...కావాలి.... గబగబ అందిన బట్టలు ఒక బేగ్‌లో సర్దుకుంది. స్నేహితురాలు, కొలీగ్ అయిన వసంత ఇంటికొచ్చేసింది. దేవుడా! నేను నేనుగా బతికే అవకాశం ఇవ్వు... ప్లీజ్...

ఈ వారం రోజులు ఆలోచిస్తూనే ఉంది. ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. తను ప్రసాద్‌ని పెళ్లి చేసుకుని తప్పుచేసిందా? ప్ఛ్... ఇప్పుడదంతా ఎందుకు? No regrets... అసలు పాపే పుట్టకుండా ఉంటే బావుండేదేమో! అబార్షన్ చేయించుకోవాల్సింది. ఈ గొడవలన్నీ రాకపోయేవేమో! ఛీ! ఇలా ఆలోచిస్తున్నానేమిటి? అయినా మనుషులు మాట్లాడేదానికి, జీవితంలో ఆచరించేదానికి చాల తేడా ఉంటుందనేదానికి నా జీవితమే సాక్ష్యం. దీనికి fullstop పెట్టేస్తే... ఛీ... ఆత్మహత్యా! అమ్మ, నాన్న నన్ను ఎంత కష్టపడి పెంచారు. కాయగూర లమ్మి, పుల్లలమోపులమ్మి- కాయకష్టం చేసి చదివించారు. చదువుల తల్లి సరస్వతి కావాలని అదే పేరు తనకుపెట్టి కష్టపడి చదివించారు. అలాంటిది మధ్యలో ఏదో అయిందని చనిపోవడమా? మొగుడు లేకపోతే ఇంక అంతా శూన్యమేనా? మరి పాప సంగతి! ఏ బాధ్యతలు లేకుండా వ్యవహరించిన ప్రసాద్‌కే బాధ్యత అప్పగిస్తే సరి. ఎప్పుడూ పిల్లల్ని పెంచాల్సిన బాధ్యత తల్లిమీదనే వదిలేస్తారెందుకో! మాతృప్రేమ- మాతృహృదయం అంటూ బరువంతా ఆడదానిమీదకి తోసేస్తారెందుకు? నేనలా కానియ్యను. ప్రసాదే పెంచుతాడు పిల్లని. ఈ సెలవుల్లో నా దగ్గరికి తెచ్చుకుంటాను. పెంపకం మాత్రం ప్రసాదుకే వదిలేస్తా. అందరూ నానా మాటలంటారు. స్వార్థపరురాలు అంటారేమో! అంటే అంటారు. ఇన్ని పద్దాక ఇదోక లెఖ్ఖా... అమ్మయ్య! ఒక నిర్ణయానికొచ్చింది.

అమ్మ నిద్రపోతుందో, లేదో అని చూసి కిటికీ దగ్గరకెళ్లింది. తూర్పున ఉదయిస్తున్న సూర్యుని తొలి వెలుగులు చూసిన సరస్వతి కళ్ళు మెరుస్తున్నాయి. కలలు కనే ఆ కళ్ళు మెరుస్తున్నాయి...

కన్నీళ్లు కార్చడం లేదు... •